క్లుప్తంగా

మేడే జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: మే 1వ తేదీన నిర్వహించనున్న 138వ మేడే వేడుకల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మేడేకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దివాకర్, నాయకులు పిడుగు శంకర్, శ్రీనివాస్, ప్రకాశ్, మోహన్, కొమురక్క తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి, పిక్లాతండా, మామిడిపల్లి, కంచన్‌పల్లి పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఏవో తిరుమల్లేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలో 17 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి ఉమర్‌షరీఫ్, ఆర్‌ఐ ప్రకాశ్, సెక్రటరీ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేందర్‌లు పరిశీలించారు. రెండు టీంలుగా ఏర్పడి పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలపై ఆరా తీశారు.

కేజీబీవీని సందర్శించిన ఎంఈవో

కెరమెరి: మండలంలో మోడి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని మంగళవారం ఎంఈవో కుడ్మెత సుధాకర్ సందర్శించారు. విద్యార్థులు, టీచర్ల హాజరు రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో చదివించారు, వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎస్‌వో మీనా కుమారి ఉన్నారు.

‘సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాల కోరు’



మాట్లాడుతున్న రేగుంట కేశవరావు మాదిగ

ఆసిఫాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంట్ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించకపోవడం సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవరావు మాదిగ అన్నారు. మండలంలోని అంకుసాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనాభా పరంగా రెండు స్థానాలు మాదిగలకు రావాల్సి ఉండగా, ఒక్కటి కూడా ఇవ్వకపోవడం అవకాశవాదానికి నిదర్శనమన్నారు. సమావేశంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు శీను మాదిగ, బేడబుడగ జంగాల రాష్ట్ర కార్యదర్శి, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి మహేశ్ మాదిగ, బేడబుడగ జంగాల జిల్లా సలహాదారుడు సమ్మయ్య, సమైక్య మహిళా నాయకురాలు కళావతి, దుర్గమ్మ, సుందరి, పద్మ, మాయ పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: గురుకులాల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆర్సీవో స్వరూపారాణికి డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆ సంఘాల నాయకులు కార్తీక్, దినకర్ మాట్లాడుతూ గురుకులాలు, వసతిగృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. సరైన తరగతి గదులు, డార్మెంటరీ రూంలు లేక ఒకేగదిలో 80 నుంచి 90 మంది నిద్ర పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మెనూ ప్రకారం భోజనం కూడా అందించడం లేదన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన

చింతలమానెపల్లి: మండలంలోని అడెపల్లి, చింతలమానెపల్లి పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో తోట ప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా కూలీలకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతీరోజు కూలీకి రూ.300లు వచ్చే విధంగా పనులు జరగాలన్నారు.

కళాశాల వార్షికోత్సవం


కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం మాట్లాడుతూ డిగ్రీ ముగించుకొని వెళ్తున్న విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండేవిధంగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



నీరు లేక దప్పికతో కార్యాలయం బయట కూర్చున్న ప్రజలు

తహసీల్దార్ కార్యాలయంలో నీటి కటకట

వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు గొంతు తడిపేందుకు గుక్కెడు నీరు లేక అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. బెజ్జూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తాగునీరు లేక దాహంతో అల్లాడిపోయారు. నీటి సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది సైతం దాహం తీర్చుకోలేని దుస్థితి నెలకొంది. – బెజ్జూర్



కార్యాలయంలో ఖాళీగా ఉన్న వాటర్ క్యాన్

గొడుగు పట్టుకొని కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు



వామ్మో ఎండలు!

జిల్లాలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియెస్ నమోదవుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. మంగళవారం దహెగాం మండల కేంద్రంలో వారసంత కావడంతో చిరువ్యాపారులు ఎండ నుంచి రక్షణ కోసం టార్పాలిన్లు, గొడుగులు ఏర్పాటు చేసుకున్నారు. తలకు రుమాలు కట్టుకొని ఎండ నుంచి రక్షించుకునేందుకు తంటాలు పడ్డారు. వామ్మో ఎండలు అంటూ భయాందోళన చెందుతున్నారు. – దహెగాం



తలకు రుమాలు చుట్టుకున్న మహిళ

కల్యాణానికి ఆలయాలు ముస్తాబు

- నేడు వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

కెరమెరి: వైభవంగా శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని శివాలయం ఇందుకు ముస్తాబైంది. ఆలయానికి ఇప్పటికే రంగులు పూశారు. ఆలయం ఆవరణలో సీతారాముల కల్యాణం జరగనుంది. ఇందుకు కావాల్సిన భద్రాచలంలోని మహిమగల శ్రీరామాలయం నుంచి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, బాసింగం, జీలకరబెల్లం, ప్రత్యేక పూజలు చేసి తీసుకొచ్చారు. కన్యాదానం, వివాహం, అభిషేకం, కలశ పూజ, గణపతిపూజ, మధుపర్కపూజ, మాంగల్యధారణ కొనసాగనున్నాయి. వివాహానంతరం మహిళలు మంగళహారతులు ఇస్తారు. ఇప్పటికే వివాహానికి ఆభరణాలు సిద్ధమయ్యాయి. స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారు. జిల్లాలోని జైనూర్, వాంకిడి, ఆసిఫాబాద్, తిర్యాని, రెబ్బెన మండలాల్లో సైతం నేడు అంగరంగా వైభవంగా కల్యాణం నిర్వహించనున్నారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక శివాలయం సీతారాముల కల్యాణానికి ముస్తాబైంది. ప్రతీ సంవత్సరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం నిర్వహించే మహోత్సవానికి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలోని కోదండ రామాలయంలో నేడు శ్రీరామనవమి వేడుకలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. బుధవారం సీతారాముల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించడానికి శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం సీతారాముల పల్లకి ఊరేగింపు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైంది. 35 ఏళ్లుగా రామాలయంలో భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీ రామచంద్రస్వామి –సీతామహాదేవి కల్యాణ కార్యక్రమాన్ని ప్రత్యేక పూజలతో నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు భట్టమేకల గట్టయ్య తెలిపారు.

కనుల పండువగా సీతారాముల ‘ఎదుర్కోలు’

రెబ్బెన: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా సీతారాముల ఎదుర్కోలు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. కోదండ రామాలయం నుంచి భక్తులు సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో నిలిపి భాజాభజంత్రీల నడుమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



దహెగాం: ముస్తాబైన ఆలయం



కెరమెరిలోని శివాలయం



వేడుకలకు ముస్తాబైన కౌటాలలోని శ్రీ కోదండ రామాలయం



రెబ్బెన: ‘ఎదుర్కోలు’ నిర్వహిస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్: ముస్తాబైన ఆలయం



రెబ్బెన: ముస్తాబైన కోదండ రామాలయం

హనుమాన్ ఆలయంలో భజన

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జన్మదినం పురస్కరించుకొని కొనసాగుతున్న జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో చెట్లరాజు భజన బృందం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో భజనా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఒజ్జల శిరీష్‌శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శులు వివేక్, వెంకన్న, సభ్యులు రాధాకృష్ణచారి, సందీప్, అజయ్, శ్రీకాంత్, సతీష్ ఉన్నారు.

శ్రీరామరక్ష స్తోత్రం పారాయణం..

హనుమాన్ జన్మదినం పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయంలో భక్తులు సామూహిక శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం చేశారు. ఉగాది నుంచి ప్రారంభమైన పారాయణం హనుమాన్ జన్మదినం (పౌర్ణిమ) వరకు కొనసాగించనున్నారు. ఆలయ అర్చకుడు అభయ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీరాముడు ఆదర్శ జీవనాన్ని గడిపారన్నారు. లోక కల్యాణం కోసం పక్షం రోజులు శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు.



భజన చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు

అన్నదానం

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంలో ఆంజనేయ మాలధారణ స్వాములకు బాబేఝరికి చెందిన రాథోడ్ సుభాష్ అన్నదానం చేశారు. మండల కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు, స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో పల్లకి ఊరేగింపు

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామంలో మంగళవారం భక్తులు సీతారాముల పల్లకిని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఉగాది సందర్భంగా మహారాష్ట్రలోని చప్రాడలోని కార్తీక్ మహరాజ్ ఆలయం నుంచి శ్రీ సీతారాముల పల్లకిని బెజ్జూర్, చింతలమానెపల్లి, కౌటాల మండలాల్లో ఊరేగిస్తారని తెలిపారు. మంగళవారం పల్లకి గుండాయిపేట్‌కు చేరుకోగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నేడు పల్లకి తుమ్మిడిహెట్టి గ్రామానికి చేరుకుంటుందన్నారు. శ్రీరామనవమి సందర్భంగా తుమ్మిడిహెట్టిలోని ప్రాణహిత నది ఒడ్డున గల శ్రీ కార్తీక్ మహరాజ్ ఆలయంలో సీతారాములకు వైభవంగా కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

కైరిగూడలో టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో మంగళవారం టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ కార్మికులకు ఎన్నో హక్కులు అందించిన టీబీజీకేఎస్‌ను కార్మికులు ఆదరించాలన్నారు. ఏరియాలో ప్రధానంగా సింగరేణి కార్మికుల పనివేళల మార్పుతో పాటు ఉచిత బస్సు సౌకర్యం, గనులు, డిపార్టుమెంట్లలో మినరల్ వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు వంటి అనేక సౌకర్యాలు కల్పించిన ఘనత టీబీజీకేఎస్‌దేనన్నారు. ఫిట్ కార్యదర్శి వెంకటేశం, ఏరియా నాయకులు వెంకటేష్, నాయకులు కిరణ్, సత్యనారాయణ, శ్యాంసుందర్, బాబురావు, శ్రీనివాస్, చందర్, రాజమౌళి, భిక్షపతి, రాజేషం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



రశీదు అందజేస్తున్న శ్రీనివాస్ రావు

‘కుంభకోణంపై విచారణ జరపాలి’

రెబ్బెన: కైరిగూడ ఓసీపీలో ఇన్‌ఫిట్ క్రషర్ నిర్మాణం పేరుతో జరిగిన రూ.7.4 కోట్ల కుంభకోణంపై సింగరేణి యాజమాన్యం వెంటనే విచారణ జరిపించాలని ఐఎన్‌టీయూసీ ఫార్మేషన్ కమిటీ చైర్మన్ సిద్దంశెట్టి రాజమౌళి డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం ఏరియాలోని కై రిగూడ ఓసీపీతో పాటు వర్క్‌షాప్‌లో కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొందరు అధికారులు కార్మికుల షిఫ్టులు మారుస్తూ ఇబ్బందులకు గురిచేయటం సరికాదని పేర్కొన్నారు. ఈమేరకు కైరిగూడ మేనేజర్ ప్రవీణ్ పాటింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రషర్ నిర్మాణ పనుల పేరుతో సుమారు రూ.7.4 కోట్ల సంస్థ నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. అధికారులు విచారణ చేపట్టి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెంట్రల్ నాయకులు ప్రకాశ్‌రావు, సదాశివ్, కాంగ్రెస్ నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

గురుకుల విద్యార్థుల ప్రతిభ

రెబ్బెన: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి గైడ్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. గత నెలలో నిర్వహించిన పరీక్షల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని దొంతుల హర్షిత సామాన్య శాస్త్రం విభాగంలో రాష్ట్ర స్థాయి 11వ ర్యాంకు, 7వ తరగతికి చెందిన శైలజ సామాన్యశాస్త్ర విభాగంలో జిల్లా స్థాయి మొదటి ర్యాంకు, 6వ తరగతి విద్యార్థి అలేఖ్య ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 2వ ర్యాంకు, 6వ తరగతి విద్యార్థిని నొగులపల్లి నైనిక గణితశాస్త్రంలో జిల్లా స్థాయి నాలుగో ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆర్సీవో స్వరూపరాణి, డీసీవో చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ చైతన్య పాల్గొన్నారు.



మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్న స్వరూపరాణి

నర్సరీల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాంనగర్, మోసం, కడంబా గ్రామాల్లో డీఆర్‌డీవో సురేందర్ పర్యటించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ప్రధానంగా ఉపాధిహామీ కూలీల సంఖ్య తగ్గిపోవడంపై ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రమేశ్, ఏపీవో సోహెబ్ ఉన్నారు.

పల్లె ప్రకృతివనంలో దొంగలు



ఫెన్సింగ్ వైరు, సిమెంటు పోల్స్ చోరీకి గురైన పల్లె ప్రకృతి వనం

బెజ్జూర్: మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో దొంగలు పడ్డారు. గతంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలోని ఫెన్సింగ్ వైర్‌తో పాటు సిమెంటు పోల్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వైకుంఠం బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కుడ్మెత వనిత(48) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనిత కొన్నేళ్లుగా తుమ్మిడిహెట్టిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఆమె గత కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఈక్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఇంటి వద్దే మృతి చెందింది. మృతిరాలికి భర్త భగవాన్ ఉన్నారు.



వనిత (ఫైల్)